www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 ఏప్రిల్ 2023



అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు

కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 85వ రోజు శుక్రవారం ఆయన 18, 19 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక గ్రామ, వార్డు సచివాలయాలు అనే గొప్ప వ్యవస్థను తీసుకురావడం ద్వారా పాలనను సులభతరం చేశామన్నారు. విద్య, వైద్య రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కీలక పోస్టుల్లో ఇన్‌ఛార్జులే..!



- వైద్యం, పంచాయతీ, ఐటిడిఎ వంటి అనేక శాఖల్లో ఇన్‌ఛార్జి అధికారులే
- జిల్లాస్థాయి పోస్టుల భర్తీకి వెంటాడుతున్న అధికారుల కొరత
- గృహనిర్మాణ శాఖలోనూ అదే పరిస్థితి రానుందా?
- ఆ శాఖ జిల్లా అధికారిని మార్చనున్నట్లు ప్రచారం సర్వత్రా చర్చనీయాంశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పలుశాఖల్లో జిల్లాస్థాయి అధికారి పోస్టులు ఇన్‌ఛార్జీలతోనే నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. ఇది పాలనపై తీవ్ర ప్రభావం చూపుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా గృహనిర్మాణశాఖ అధికారిని మార్చనున్నట్లు సాగుతున్న ప్రచారం సర్వత్రా చర్చనీయాంశమైంది. అసలు అధికారుల మార్పు వెనుక ఏం జరుగుతుందనే చర్చ సాగుతోంది. ఏలూరు జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఉంది. వైద్యపరంగా అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఆ శాఖ ఇన్‌ఛార్జి అధికారి పాలనలోనే నడుస్తోంది. జిల్లాలో మరో కీలకమైంది పంచాయతీశాఖ. ఇక్కడ సైతం ఇన్‌ఛార్జి అధికారే ఉన్నారు. గడిచిన ఏడాదిలో ఈ శాఖలో ముగ్గురు అధికారులు మారిన పరిస్థితి నెలకొంది. మెట్ట ప్రాంతంలో అత్యంత ప్రధానమైన ఉద్యాన శాఖాధికారి కూడా ఇన్‌ఛార్జినే ఉన్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో అతిముఖ్యమైన ఐటిడిఎను కూడా కొంతకాలంగా ఇన్‌ఛార్జి అధికారి పాలనలోనే నెట్టుకొస్తున్నారు. ఇలా చెప్పుకుంటేపోతే ఏలూరు జిల్లాలో దాదాపు పదికిపైగా శాఖల్లో జిల్లా అధికారులుగా ఇన్‌ఛార్జులే ఉన్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో 27 మండలాలు ఉన్నాయి. జిల్లాలో మెట్ట, ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉంది. ఇక్కడి ప్రజలకు ప్రభుత్వ పథకాలుగాని, సంక్షేమ ఫలాలుగాని సక్రమంగా అందాలంటే సమర్థులైన జిల్లా అధికారుల అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే సెకండ్ గ్రేడ్ ఉద్యోగులను జిల్లా అధికారిగా నియమించినా నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్న పరిస్థితి ఉంది. అంతేకాకుండా ఆ శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారులు ఇన్‌ఛార్జి అధికారుల మాట సక్రమంగా వినే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో సకాలంలో పనులు జరగని పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇన్‌ఛార్జీగా ఉన్న అధికారి నిర్ణయాలు తీసుకోవడంలోను తడబాటు కన్పిస్తోంది. ఏదైనా నిర్ణయం తీసుకుంటే తమ పైఅధికారుల నుంచి ఎటువంటి ఇబ్బందులు వస్తాయోననే భయం వారిని వెంటాడుతోంది. అదే జిల్లాస్థాయిలో రెగ్యులర్ అధికారి ఉంటే నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులతో మాట్లాడి తమకు కావాల్సిన నిధులు రాబట్టుకునే సమర్థత ఉంటుంది. ఇన్‌ఛార్జీల ఏలుబడిలో జిల్లాపాలన కుంటుపడుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లాస్థాయి అధికారుల పోస్టులు భర్తీ కాకపోవడానికి కారణాలు ఏమైనా ఉన్నాయా.. ఇక్కడికి అధికారులు వచ్చేందుకు ఇష్టపడకపోవడానికి కారణాలు ఏమిటనే చర్చ సైతం నడుస్తోంది. సెకండ్ గ్రేడ్ అధికారులైతే తమ మాట తూచ తప్పకుండా పాటిస్తారనే అభిప్రాయంతో జిల్లా ఉన్నతాధికారులు ముందుకు సాగుతున్నారా అనే ప్రచారం సైతం నడుస్తోంది. ఏదేమైనా జిల్లాస్థాయి పోస్టుల్లో ఇన్‌ఛార్జులు ఉండటం పాలనాపరంగా ఇబ్బందికరమే.

అదేబాటలో గృహ నిర్మాణ శాఖ..?

జిల్లాస్థాయిలో అతిముఖ్యమైన శాఖల్లో గృహనిర్మాణశాఖ ఒకటి. ప్రస్తుతం ప్రభుత్వం ముందుకు తీసుకెళు‌న్న అతిముఖ్యమైన పథకాల్లో గృహనిర్మాణం ప్రధానమైంది. జగనన్న లేఅవుట్లలో ఇళ్లనిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ అధికారిగా ఉన్న వేణుగోపాల్ సమర్థుడైన అధికారిగా పేరొందారు. ఆ శాఖపై మంచి పట్టున్న అధికారిగా ప్రజాప్రతినిధులే చెబుతున్న పరిస్థితి ఉంది. అలాంటి అధికారిని మార్చబోతున్నట్లు గడిచిన రెండురోజులుగా ప్రచారం సాగుతోంది. ఏలూరు జిల్లాలో టార్గెట్‌కు అనుగుణంగా గృహనిర్మాణాలు పూర్తిచేయడంలోనూ ఆయన ముందున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. లబ్ధిదారులకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ పరిష్కరించే అధికారిగా పేరుంది. అలాంటి అధికారిని ఎందుకు మారుస్తున్నారనే చర్చ రాజకీయ నాయకుల్లోనూ, ఉద్యోగుల్లోనూ సాగుతోంది. దీనివెనుక ఏమైనా అంతర్గత కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలుశాఖలను ఇన్‌ఛార్జి అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. ఇప్పుడు అత్యంత ప్రధానమైన శాఖ అధికారి కూడా వెళ్లిపోతే గృహనిర్మాణం కుంటుపడే పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుత అధికారి వేణుగోపాల్‌ను కొనసాగించాలని ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.

ఘోరం..



మృతురాలు గంజి నిర్మల

- భార్యను నరికి చంపిన కసాయి భర్త
- ఆపై పురుగుల మందు తాగి ఆత్మహత్య
- అనాధలైన ముగ్గురు పిల్లలు



మృతుడు దావీదు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భార్యను నరికి చంపి, ఆపై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గంజి నిర్మల (35), దావీదు భార్యాభర్తలు. వీరికి పదేళ్లలోపు వయస్సున్న ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం, కుటుంబం గడవడం కష్టంగా మారడంతో పిల్లలను తన పుట్టింట్లో ఉంచి నిర్మల ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లింది. ఈ క్రమంలో తనకు డబ్బు పంపడం లేదని కుమార్తెలను తన ఇంటికి తీసుకొచ్చి చిత్రహింసలు పెట్టి వీడియో తీసి దావీదు తన భార్య నిర్మలకు పంపాడు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు దావీదును అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ క్రమంలో నిర్మల గల్ఫ్ నుంచి తిరిగొచ్చి పెంటపాడులోని కూనాగరపేటలోని పుట్టింట్లో ఉంటోంది. దావీదు రెండు నెలల క్రితం జైలు నుంచి బయటికొచ్చాడు. మూడు రోజుల క్రితం పెంటపాడు వచ్చిన దావీదు తాను మారిపోయానని, భార్యను, పిల్లలను బాగా చూసుకుంటానని చెప్పి నిర్మలను వీరంపాలెం తీసుకెళ్లాడు. పిల్లలు వేసవి సెలవుల నేపథ్యంలో కొయ్యలగూడెం బంధువుల ఇంటికెళ్లారు. గురువారం రాత్రి మరోసారి నిర్మల, దావీదు నడుమ ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో నిర్మలను దావీదు కత్తితో విచక్షణారహితంగా మెడపై నరికాడు. రెండు చేతులు, మణికట్టుపైనా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం దావీదు పక్కనే ఉన్న చెరకుతోటలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న



భార్య, పిల్లలతో దావీదు (ఫైల్‌ఫొటో)

దావీదు కుటుంబీకులు హుటాహుటీన తాడేపల్లిగూడెం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని భీమవరం డిఎస్‌పి బండారు శ్రీనాథ్, సిఐ మూర్తి, రూరల్ ఎస్ఐ భద్ర సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మూర్తి తెలిపారు.

మేడేను విజయవంతం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఉండి

శ్రామిక సంబరాలుగా మేడేను నిర్వహించి విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహాదేవపట్నంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి కొట్టాడ వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన మేడేను ప్రతి ఒక్క కార్మికుడు ఘనంగా నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటల పని దినంగా మార్చేందుకు కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొస్తుందని, దీనిని వ్యతిరేకించేందుకు కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని సూచించారు. మేడే రోజున పనిచేసే చోట సిఐటియు జెండా ఆవిష్కరించి అనంతరం ఉండి మెయిన్ సెంటర్లో నిర్వహించే కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం త్రిపుర సహాయనిధికి బేవరేజెస్ హమాలీ వర్కర్స్ రూ.వెయ్యి ఆర్థిక సహాయాన్ని జెఎన్‌వి.గోపాలన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ధనికొండ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు కలిదిండి సూర్యనారాయణరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజస్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు బూడి సత్తిబాబు, మందపాటి శివశంకర్, గెద్దా వెంకటేష్, పోతురాజు కుమారరత్నం, మల్లుల లక్ష్మీనారాయణ, యాళ్ల అప్పారావు పాల్గొన్నారు.

తణుకురూరల్: మేడే వారోత్సవాల్లో ఉద్యోగ, కార్మికులు సాంస్కృతిక, ఆటల పోటీల్లో పెద్దఎత్తున పాల్గొనాలని సిఐటియు పట్టణ కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం మేడే సన్నాహక సమావేశాలు, కార్మికులకు క్రీడా పోటీలు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. జట్టు కార్మికులు కబడ్డీ, పరుగు పందెం పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, పట్టణ అధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపీ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాల ద్వారా వచ్చిన హక్కులను మోడీ ప్రభుత్వం హరించి కార్మికులను కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చిందని విమర్శించారు. ఏ ప్రభుత్వం వచ్చినా కార్మికులకు ఏమీ చేయడం లేదని, పైగా పోరాడితే వారిపై అక్రమ కేసులు, అరెస్టులు పెడుతున్నారని అన్నారు. ఏ దేశమైనా కార్మికుల శ్రమ లేకుండా ముందుకు పోదని, అలాంటి కార్మికుల పట్ల అధికారంలో ఉన్నవారు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. కార్మికులకు అన్యాయం చేసే ఏ ప్రభుతాన్నయినా వచ్చే ఎన్నికల్లో గద్దె దింపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, బి.శివ తదితరులు పాల్గొన్నారు.

చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో చలువ పందిళ్లు, చలివేంద్రాలు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై చలువ పందిళ్లు, చలివేంద్రాలు, జిఎస్‌డబ్ల్యుఎస్ సర్వీసులు, స్పందన, ఎస్‌డిజి గోల్స్, టిడ్కో హౌసింగ్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సోమవారం నుండి 15 రోజులపాటు వేసవి ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా సంచరించే కూడళ్లు, మార్కెట్లు, తదితర ప్రదేశాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలను ఎండ తీవ్రత నుండి రక్షించిన వారమవుతాన్నారు. ఇప్పటికే భీమవరం పట్టణంలోని బుధవారం మార్కెట్, బస్టాండ్ ప్రాంతాల్లో చలువ పందిళ్లను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదే తరహాలో జిల్లాలోని మిగతా పట్టణ ప్రాంతాల్లో కూడా చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో షాపింగ్ మాల్స్, ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్, ఇతర కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో బార్లీ, రాగిజావ, మజ్జిగ వంటి పానీయాలను నాణ్యతతో అందించేలా చూడాలన్నారు. వార్డు సచివాలయాల్లో సర్వీసులను నిర్ణీత గడువులోపు అందించాలన్నారు. స్పందన ఫిర్యాదుల్లో సంతృప్తికరమైన పరిష్కారాన్ని చూపకపోవడంతోనే పిటీషన్లు తిరిగి ఓపెన్ అవుతున్నాయని, ఇలా జరగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వార్డు సచివాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రోడ్ల మార్జిన్ల వెంబడి ఫేవర్ బ్లాక్స్ ఏర్పాటు ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. వెంటనే సంబంధిత పనులను పూర్తి చేయాలని సూచించారు. ఎస్‌డిజి గోల్స్ సాధనలో బెంచ్ మార్క్ పెట్టుకుని పని చేయాలన్నారు. టిడ్కో గృహాల నిర్మాణం 75 శాతం పూర్తయిన వాటిని నూరు శాతం పూర్తయ్యేలా సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడి ఎక్కువ మేస్త్రీలను, పనివారిని పెట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రుణాల మంజూరును కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. రుణాల మంజూరు విషయంలో ఇబ్బందులు తలెత్తితే లీడ్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. చనిపోయిన లబ్ధిదారుల స్థానంలో వారి కుటుంబీకులకు ఇంటిని కేటాయించేందుకు అవసరమైన చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్‌ఆర్ అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎన్‌వివి.రమణ పాల్గొన్నారు.

సాయిూష్ అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - పాలకొల్లు

అమెరికాలో గత వారం దుండగుల కాల్పుల్లో మృతి చెందిన పాలకొల్లుకు చెందిన వీరా సాయిష్ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. అతని మృతదేహం గురువారం సాయంత్రం ఏలూరులోని నివాసానికి చేరింది. అనంతరం పాలకొల్లుకు తరలించారు. దీంతో నాగరాజుపేటలోని తాతయ్య, సీనియర్ జర్నలిస్టు వీర సత్యం స్వగృహం వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. సాయిూష్ మృతదేహాన్ని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సందర్శించి, అతని కుటుంబానికి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో పట్టణ ప్రముఖులు పోలిశెట్టి రాధాకృష్ణ, మేడికొండ శ్రీనివాస్, వంగా నరసింహారావు, మద్దాల రాజేష్, ఎపియుడబ్లుజె జిల్లా ఉపాధ్యక్షుడు పిటి వెంకటేశ్వరరావు ఉన్నారు.

కోపల్లెలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె హైస్కూల్లో శుక్రవారం రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. డాక్టర్ దంతులూరి విజయరామరాజు మెమోరియల్ రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు ప్రారంభించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల మధ్య వాలీబాల్ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, ఉప సర్పంచి బూడి వెంకటపత్రాలు, పి.విశ్వనాధరాజు, మంతెన రామ్‌కుమార్‌రాజు, వి.రామరాజు పాల్గొన్నారు.

బడా పెట్టుబడిదారులకు బిజెపి ఊడిగం : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడా పెట్టుబడిదారులు అంబాని, అదానిలకు ఊడిగం చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో జిన్నూరులో సిపిఎం ప్రచారభేరి యాత్ర నిర్వహించి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ముగింపు సభ గ్రామ శాఖ కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో గోపాలన్ మాట్లాడుతూ ప్రజలపై ధరలు పెంచి భారాలు మోపుతూ బడాపెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్లు రాయితీలు రుణమాఫీ చేస్తుందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగకల్పనలో మోసగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మత విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. ముందుగా టి.గాంధీ ఇంటి వద్ద నుంచి యాత్ర ప్రారంభమై నరసరాజునగర్, బూపయ్యచెర్వు, పెదపేట మీదుగా సాగింది. సభలో సీనియర్ నాయకులు తాళాబత్తుల గాంధీ, మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేతలు చివటపు ఆంజనేయులు, వెల్దూటి నాగేశ్వరరావు, నల్లి రాముడు, కిలారి సాంబయ్య, గుబ్బల గంగాజలం, పోతురాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన విఆర్‌ఒ సంఘ నేతలు

ప్రజాశక్తి - భీమవరం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రామ రెవెన్యూ సంఘం సభ్యులు

జిల్లాలో ఇటీవల నూతనంగా ఏర్పడిన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ కార్యవర్గం నేతలు శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిఆర్ఒ కృష్ణవేణి, ఎఒ దుర్గాకిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు గుమ్మడి జక్రయ్య, జిల్లా కోశాధికారి గుర్రం చిట్టిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఏసుబాబు, శ్రీనివాసరావు, రాంబాబు, ఆకుల బాబు రాజేంద్రప్రసాద్. జిల్లా జాయింట్ సెక్రటరీ కొల్లాటి లక్ష్మి, యార్లగడ్డ రాజు, పద్మశ్రీ ముత్యాలు, శ్రీహరి, వీరవెంకట సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పెంటయ్య, వెంకట సూర్యనారాయణ, జయరామ్, ప్రచార కార్యదర్శి మందలంక శీను, నేతలు నాగేశ్వరరావు, అప్పారావు, దాసు, కృష్ణస్వామి, విజయలక్ష్మి, కెనడీ, పంపన సురేష్, సత్తిబాబు, శ్రీనివాసు, చెల్లయ్య, ముత్యాలు పాల్గొన్నారు.

మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలి: ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - భీమవరం

మత్తు పదార్ధాలకు యువత దూరంగా ఉండాలని, వాటిని వినియోగించడం వల్ల కలిగే నష్టాన్ని వివరిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక డిఎన్‌ఆర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. డిఎన్‌ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సోమరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాల్ని చేరుకోవాల్సిన యువత మత్తు పదార్ధాలకు బానిస కావడం వల్ల వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ గంజాయి తదితర వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఆకాంక్షించారు. దీనిపై అవగాహన పెంచేందుకు ఎస్‌ఎఫ్‌ఐ కృషి అభినందనీయమన్నారు. కళాశాల ఎన్‌సిసి ఎఎన్‌ఒ చీఫ్ వీరయ్య మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ తరహా కార్యక్రమాలు ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహించడం హర్షణీయమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుండి మాదకద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరిస్తూ పాఠశాల స్థాయి నుండి డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల స్థాయి వరకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తామన్నారు. విద్యారంగంలో వచ్చే సమస్యలపైనే కాదు.. విద్యార్థుల భవిష్యత్తుపైనా ఎస్‌ఎఫ్‌ఐ దృష్టి సారించి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వి.భానుప్రకాష్, టి.ప్రసాద్, నాయకులు యు.వినోద్, ఎస్.లక్ష్మణ్, పి.సుజిత, పి.మోహినిలక్ష్మీ, బి.గణేశ్, పవన్, గణేష్ పాల్గొన్నారు.

1153 రకం ధాన్యం కొనుగోలుపై ఆందోళనొద్దు

ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - వీరవాసరం



మిల్లర్స్‌తో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

దాళ్వాలో పండించిన 1153 రకం ధాన్యం కొనగోలుకు సంబంధించి రైతులకు ఎదరవుతున్న ఇబ్బందులకు సంబంధించి ఆందోళన చెందనవసరం లేదని భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. ఈ రకం ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆయన వీరవాసరం మండలానికి చెందిన రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. తహాశీల్దార్ సుందరరాజు, వ్యవసాయ శాఖ ఎఇ గీతాదేవి, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, మిల్లర్లు పాల్గొన్నారు. మండలంలో 1153, 1156, 1121, 3626 రకాలు సాగు చేసినట్లు గుర్తించారు. ఎక్కువ మంది రైతులు 1153, 1156 రకాలు సాగు చేశారని, ఈ రెండు రకాలు ప్రస్తుతం అధిక శాతం ముక్కవుతుందని మిల్లర్లు తెలిపారు. దీంతో మిల్లింగ్ తరువాత ముక్క శాతం అధికంగా వస్తే ప్రభుత్వానికి అందించే బియ్యం శాతం తగ్గుతుందని, దీనికి మిల్లర్లను బాధ్యులను చేస్తే నష్టపోతామని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సాధారణంగా ముక్క శాతం 30లోపు రావడం పరిపాటని, అయితే ఈ రకాలు 50 శాతం పైబడి ముక్కవుతుందని మిల్లరు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 1153, 1156 రకాలు అధిక శాతం ముక్కవుతుందని తెలిసినప్పటికీ వ్యవసాయశాఖ ఏ విధంగా సాగుకు అనుమతిచ్చిందని ప్రశ్నించారు. దీంతో ఎఒ గీతాదేవి మాట్లాడుతూ ఈ రకాన్ని సాగు చేయమని రైతులకు సూచించలేదని తెలిపారు. రైతులు తమ ఇష్టానుసారంగా ఈ రకాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. పంట కాల పరిమితి తక్కువ, దిగుబడి బాగా వస్తుందని రైతులు ఈ రకాలపై మక్కువ చూపి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో ఆర్‌డిఒ జోక్యం చేసుకుని ఈ సమస్య అన్ని ప్రాంతాల్లో లేదని, స్థానికంగా ఎదురవుతున్న ఈ సమస్య పట్ల మిల్లర్లు సానుకూలంగా స్పందించాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మిల్లర్లు, రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నయ మార్గం చూపుతామన్నారు. ఈ సమస్యకు ప్రభుత్వమే తక్షణ పరిష్కార మార్గం చూపాలని రైస్‌మిల్లర్ల సంఘం నేతలు కోరారు. సమీక్షలో రైస్‌మిల్లర్లు పోలిశెట్టి సత్యనారాయణ, మళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులే కీలకం

ప్రజాశక్తి - భీమవరం రూరల్



తణుకు రూరల్ : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులే కీలకంగా మారాయని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని వెంపలో ఉపాధి పని ప్రదేశంలో వారు శుక్రవారం కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ, ఆక్వా, రియల్ ఎస్టేట్ ఫలితంగా కూలీలకు పని పూర్తిగా లేకుండాపోయిందని, నేడు గ్రామీణ ప్రాంతాల్లో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్ట పనులే కీలకంగా మారాయని అన్నారు. అంత ప్రాధాన్యత ఉన్న ఉపాధి హామీకి బడ్జెట్లో కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకోవడం దుర్మార్గమన్నారు. రెండు పూటలా ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్ విధానం కూలీలకు శాపంగా మారిందన్నారు. శివారు ప్రాంతాల్లో నెట్‌వర్క్ పని చేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు ఒకపక్క ఎండలు పెరిగాయని, దానికి తగ్గట్టు పని ప్రదేశంలో సౌకర్యాలు, సమ్మర్ అలవెన్స్, మజ్జిగ వంటివి తొలగించడం కూలీలను మోసగించడమేనని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు పెంచి సౌకర్యాలు మెరుగుపర్చకపోతే రానున్న రోజుల్లో కూలీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లెల్ల మరియమ్మ, వేంద్ర అమ్మాజీ, చిలకపాటి శ్యాంబాబు, బాలం సక్కుబాయి, ఇంజేటి మరియమ్మ పాల్గొన్నారు.

ఇరగవరం: ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ కూలీల పొట్టకొడుతున్న మోడీ ప్రభుత్వ విధానాలను పోరాటాలతో తిప్పికొట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. ఇరగవరం మండలం రేలంగి శివారు పంటబోదెలో పని చేస్తున్న కూలీలను ఉపాధి పర్యటనలో భాగంగా కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల కారణంగా కూలీలకు వ్యవసాయ పనులు తగ్గిపోయాయన్నారు. కూలీలను ఆదుకుంటున్న ఉపాధిహామీ చట్టంను నిర్వీర్యం చేయడం తగదన్నారు. ఉపాధి హామీలో పనులు చేసిన వారందరికీ వేతనాలు కేంద్ర ప్రభుత్వమే చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ మోడీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా ఇబ్బంది పెడుతుందన్నారు. ఈ విధానాలను కూలీలంతా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో కామన. వెంకటేశ్వర్లు, కామన అనంతలక్ష్మి, అయినం నాగేశ్వరరావు, తొంట అన్నవరం, కాగిత పెద్దిరాజు, అయినం చంద్రం, కామన దుర్గ, పంది దానమ్మ పాల్గొన్నారు.

పథకాలపై సిఎం సమీక్ష

హాజరైన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాం, పేదల ఇళ్ల నిర్మాణాలు, భూ హక్కు - భూ రక్ష, నాడు-నేడు పథకాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసిరాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేర్ డెంటల్ ఆసుపత్రి సౌజన్యంతో ఉద్యోగులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. 100 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా పేస్టులు మందులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇహెచ్‌ఎస్ కార్డు ద్వారా నగదు రహిత దంత వైద్యం కేర్ డెంటల్ ఆసుపత్రిలో అందిస్తున్నట్లు డాక్టర్ కెవిఎం.రామచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, డాక్టర్ నదియా, సంఘం అధ్యక్షులు అల్లూరి శ్రీనివాసరావు, కార్యదర్శి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల కళ్యాణమండప నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 18వ వార్డులో నాయీ బ్రాహ్మణుల కళ్యాణ మండపానికి రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర రూ.20 లక్షలు మంజూరు చేయడంతో భవన నిర్మాణం పూర్తిచేస్తున్నట్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. శుక్రవారం ఆయన కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. టిడిపి హయాంలో రూ.10 లక్షలతో దీని నిర్మాణం ప్రారంభించామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల లేక పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. తమకు అధికారం లేకపోయినా రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర రూ.20 లక్షల నిధులతో నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 29వ తేదీన పెనుమంట్ర హైస్కూల్లో నవోదయ ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ డి.శారదాజ్యోతి తెలిపారు. శుక్రవారం పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. మొత్తం 253 మంది విద్యార్థులకు, 14 మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా హైస్కూల్ హెచ్‌ఎం కె.సాయి సూర్యనారాయణరావు, సిఎల్‌ఒగా జి.సంతోష్, జెవిఎన్ పెదవేగి వ్యవహరిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా రాక

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా ఈ నెల 29న శనివారం జిల్లాకు రానున్నట్లు జిల్లా సమాచార శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 29వ తేదీ ఉదయం 10 గంటలకు తుని నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు భీమవరం చేరుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న జిల్లా సమీక్ష సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు భీమవరం నుండి బయలుదేరి తుని వెళ్తారని తెలిపారు.

యాప్‌లు వినియోగించుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి- తణుకు

టిడిపి నాయకులు పార్టీ రూపొందించిన యాప్‌లను సక్రమంగా వినియోగిస్తూ సోషల్ మీడియాలో దూసుకెళ్లాలని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. శుక్రవారం స్థానిక బివిఎస్ ప్యాలెస్ హాల్లో మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఐటిడిపి, క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌ఛార్జిల, మండల పార్టీ అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన నాయకులు పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ టిడిపి నాయకులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మండల అధ్యక్షుడు మోహనరావు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థినులకు పురస్కారాలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉల్లంపర్రు సబితా ఉమెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థినులకు రూ.2,60,000 పురస్కారాలు అందజేసినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కస్పాండెంట్ మద్దాల వాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీలో అత్యధికంగా 460 మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.20,000 రూపాయలు చొప్పున ప్రతిభా పురస్కారం అందజేసినట్లు తెలిపారు. అలాగే 95 శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థినులకు రూ.20 వేలు, 75 శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థినులకు రూ.12 వేలు, 60 శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థినులకు రూ.6,000 చొప్పున అందజేశామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబితా ఉమెన్స్ జూనియర్ కాలేజ్ వ్యవస్థాపకులు డాక్టర్ బాబ్జి మాట్లాడారు. మాంటిస్సోరీస్ విద్యాసంస్థల యాజమాన్యం స్వీయ పర్యవేక్షణలో, విలువలతో కూడిన విద్యనందిచడమే కాకుండా లక్షల రూపాయలను ప్రతిభావంతులైన విద్యార్థినులకు అందిస్తున్న యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ ఎస్.వసంతలక్ష్మిని, కళాశాల అధ్యాపకులను అభినందించారు. . విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీ మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ కత్తుల రామ్మోహన్, విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో నూతన విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.హరగోపాల్ పాల్గొన్నారు. విద్యా 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభాగ్యం' అనే 3 అంశాలపై విద్యా విధానం అభివృద్ధి చేస్తుందని, విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకోవాలని కోరారు. విద్యా విధానంలో సమాన అవకాశాల కల్పన లేకుండా దేశం మొత్తం ప్రామాణిక పరీక్షల నిర్వహణ అత్యంత కష్టమవుతుందని తెలిపారు. విద్య మేధోసంపత్తిని పెంపొందిస్తుందన్నారు. విద్యార్థినులు కాలానుగుణంగా వచ్చే ఆర్థిక సామాజిక సాంస్కృతిక మార్పులకు అనుగుణంగా మార్పు చెందాలంటే విద్యా విధానంలో వారికి ఎక్కువ శాతం అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, అకడమిక్ అడ్వయిజర్ నందుల సీతారామారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొల్లు

సామాజిక చైతన్య పాదయాత్ర సందర్భంగా టిడిపి దళిత నేతలు కట్టిన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, జ్యోతిరావుపూలే చిత్రపటాలు ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలిగించడం అన్యాయమని, వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి దళిత నేతలు పట్టణ సిఐ డి.రాంబాబుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. జాతీయ నేతల ఫ్లెక్సీలు చించేసి మురుగు కాల్వలో పడేయడం దారుణమని ఫిర్యాదు చేశారు. తమకు నోటీసులు ఇవ్వకుండా చింపి మురుగు కాల్వలో పడేసిన పంచాయతీ సెక్రటరీ, సచివాలయ, పోలీస్‌లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - కాళ్ల

ఎస్‌సి బోస్ మాజీ సైనిక్‌కాలనీలో పేకాటాడుతున్న ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశామని ఆకివీడు సిఐ గీతా రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.36 వేల నగదు, 5 బైకులు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ప్రాతళ్లమెరక పంచాయతీకి పురస్కారాలు

ప్రజాశక్తి - కాళ్ల



ప్రాతళ్లమెరక గ్రామం

ప్రాతళ్లమెరక పంచాయతీకి ఆరోగ్యం, సామాజిక భద్రత విభాగాల్లో రెండు పురస్కారాలు దక్కాయి. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డుల్లో కాళ్ల మండల స్థాయిలో ప్రాతళ్లమెరక గ్రామానికి రెండు అవార్డులు వరించాయి. పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, బాల స్నేహపూర్వక, జల సమృద్ధి, పరిశుభ్రత, సామాజిక భద్రత, మహిళా హిత, స్వయం సమృద్ధి, నాణ్యమైన పరిపాలన వంటి తొమ్మిది అంశాల్లో రాణించిన గ్రామ పంచాయతీలకు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఎంపిక చేసిన ఉత్తమ గ్రామ పంచాయతీలకు ఈ అవార్డులు ప్రకటించారు.

ఆరోగ్య ప్రాతళ్లమెరక..

సుమారు 1300 జనాభా ఉండే ప్రాతళ్లమెరక జనన మరణాలు, పౌష్టికాహారం, వైద్య సదుపాయం వంటి కీలక అంశాల ఆధారంగా ఈ అవార్డు వచ్చింది. ప్రాతళ్లమెరకలో ఓ మినీ అంగన్‌వాడీతో కలిసి రెండు ప్రీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గర్భిణుల్లో రక్త హీనత నివారణకు వైఎస్ఆర్ కిట్లు, జగనన్న సంపూర్ణ పోషణ ద్వారా పిల్లలకు ప్రత్యేక మెనూ ఇస్తారు. ఇక వైద్య సేవలకు వస్తే ప్రతి ఇంటికీ వైద్యుడు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రక్తహీనత బాలలు, గర్భిణులు, బాలింతలు లేకుండా చర్యలు తీసుకున్నారు. విజయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్టు వారి సహకారంతో సచివాలయ భవనం, ఆర్‌బికెతోపాటు వైఎస్ఆర్ హెల్త్ సెంటర్ కూడా అన్ని మౌలిక వసతులతో ఏర్పాటైంది. స్థానికంగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ హెల్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆశాలు, సచివాలయ ఎఎన్‌ఎంలు గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి ప్రాథమిక వైద్య చికిత్సలు అందిస్తున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

సామాజిక భద్రత..

గ్రామంలో సామాజికంగా వెనుబడిన వారికి, వయోభారంతో ఉన్న వృద్ధులకు చేయూతనందించేందుకు సంక్షేమ కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతోపాటు 192 మందికి పింఛన్లు అందజేస్తున్నారు. వారిలో వృద్ధులు 103 మంది, వితంతువులు 31 మంది, వికలాంగులు 13 మంది, మత్స్యకారులు 28 మంది, ఒంటరి మహిళలు ఇద్దరు, అభయహస్తం 11, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి ఒకరు, డయాలసిస్ ఇద్దరికి పింఛన్లు అందజేస్తున్నారు.

అవార్డుల వల్ల బాధ్యత మరింత పెరిగింది

కంతేటి ఉష శ్రీనివాసరాజు, సర్పంచి, ప్రాతళ్లమెరక



తమ గ్రామానికి మండల స్థాయిలో రెండు పురస్కారాలు రావడం సంతోషంగా ఉంది. ఈ అవార్డులు బాధ్యతను మరింత పెంచాయి. దాత వేగిరాజు శివవర్మ సహాయ సహకారాలతో ప్రభుత్వ నిధులతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలి

జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి

ప్రజాశక్తి - కాళ్ల

గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా పౌష్టికాహారం అందించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాళ్ల-1 సచివాలయాన్ని జిల్లా కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్, వైద్య, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. గ్రామంలో ఎంతమంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు? వారందరికీ మెడికల్ చెకప్‌లు చేశారా ? ఈ నెలలో ఎంత మంది డెలివరీ అయ్యారు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురించి వివరాలను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి డాక్టరు, సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులివ్వాలని తెలిపారు. వైద్యం అందించడంతో పాటు వారం, వారం వారి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి అందుకు అనుగుణంగా వైద్య సేవలందించాలన్నారు. వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసిడిఎస్ అధికారి బి.సుజాతారాణి, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఎంపిడిఒ జి.స్వాతి, వైద్యాధికారి, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యుంజయ సొసైటీ ఛైర్‌పర్సన్ శారదాదేవి మృతి

ప్రజాశక్తి - ఆచంట



శారదాదేవి (ఫైల్‌ఫోటో)

ఆచంట గ్రామానికి చెందిన ది మృత్యుంజయ సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్‌గా పనిచేస్తున్న వైట్ల శారదాదేవి (64) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమెకు ఒకే కుమారుడు వైట్ల కిషోర్‌కుమార్. ఆయన ప్రస్తుతం వైసిపి కార్యదర్శిగా పనిచేస్తున్నారు. శారదా దేవి అకాల మృతి పట్ల ఎంఎల్‌ఎ [illegible] శ్రీరంగనాథరాజు, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, డైరెక్టర్లు, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సొసైటీ పర్సన్స్ పెచ్చెట్టి సత్యనారాయణ, మొండే శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి పారుపల్లి ఏసురత్నం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, సొసైటీ అధ్యక్షులు, ఛైర్‌పర్సన్లు, నాయకులు, కార్యకర్తలు, టిడిపి, జనసేన, సిపిఎం నాయకులు సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. శారదాదేవి అంత్యక్రియలు కార్యకర్తలు, అభిమానులు, బంధువుల మధ్య వశిష్ట గోదావరి వద్ద నిర్వహించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ ఆందోళనకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం మే 3న జరిగే ఆందోళనలకు సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖస్టీల్ ప్లాంట్ తెలుగుజాతి ప్రజల త్యాగాల ఫలితామని తెలిపారు. స్టీల్ ప్లాంట్ సాధన కోసం 32 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. నాడు వేలాది మంది రైతులు తమ భూముల్ని కారు చౌకగా విశాఖ ఉక్కు నిర్మాణానికి అందించారని తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ రూ.4 లక్షల కోట్లకు పైగా విలువ చేస్తుందని తెలిపారు. కేంద్రం తక్షణం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను మానుకోవాలని సూచించారు. కేంద్రంలోని బిజెపి నాయకులు రెండు నాల్కల ధోరణితో ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి జనసేన కూడా విశాఖ ఉక్కు పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రత్యక్ష ఆందోళనల్లో పాల్గొనాలని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జరిగే ఆందోళనల్లో ప్రజలు పెద్ద ఎత్తున కదిలి రావాలని బలరాం కోరారు.

ప్రతి వార్డూ అభివృద్ధి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని ప్రతి వార్డునూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 35వ వార్డులో రూ.19.50 లక్షల నిధులతో నిర్మించనున్న కాస్మో క్లబ్‌కు వెనుకవైపు రామాలయం మెయిన్ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసే దిశగా అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామి సన్నిధిలో సంగీత దర్శకుడు కోటి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సోమేశ్వర, జనార్ధన స్వామిని సినీ సంగీత దర్శకులు కోటి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు ఘనంగా సత్కరించారు. స్వామివారి ప్రతిమతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పాటుపడాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సహకార సంఘాలకు నూతన పాలకవర్గ సభ్యులుగా నియమితులైన వారు రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన కొలుపూరి గౌరీ, డైరెక్టర్‌గా ఎన్నికైన చికిలే విశ్వేశ్వరయ్య, మత్యపురి సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన కురెళ్ల కాశీ విశ్వేశ్వరరావు, డైరెక్టర్లు పాలా నెల బాలుడు, పోతుల లీలాకర్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేసినప్పుడే త్రిసభ్య కమిటీలకు మంచి పేరు వస్తుందన్నారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే దిశగా త్రిసభ్య కమిటీలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వీరవాసరం మండల కన్వీనర్ గూడూరి ఓంకార్, వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రైతులు పూడికతీత

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని రామలబంద గరువు నుంచి శివాలయం వరకూ కొనాయికోడు కాలువలో పూడిక తీత పనులు శుక్రవారం రైతులు స్వచ్ఛందంగా చేపట్టారు. తూడు, నాచు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు కాలువ పూడికపోయింది. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి యంత్రంతో పూడిక తొలగింపు పనులు చేపట్టారు.

రైతుల ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, లేకుంటే రైతుల పక్షాన పోరాడతామని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ టీవీల్లో, మీడియాలోనూ ప్రతి ధాన్యం గింజనూ కొంటామని ప్రభుత్వం ఊదరగొడుతోందని, ఏ రైస్ మిల్లు వద్ద చూసినా ట్రాక్టర్లు, లారీలపై 3, 4 రోజుల పాటు ధాన్యం బస్తాలతో రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే అక్కడ సివిల్ సప్లై ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి వాళ్లే సంబంధిత మిల్లుకు పంపించి మళ్లీ ఈ మిల్లు దగ్గర దింపుకోవడానికి ఎదురు డబ్బులు రూ.5 వేలు, రూ.10 వేలు, రూ.20 వేలు కట్టమంటే రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతుల కోసం రోడ్డు ఎక్కడం కాదు, తాడేపల్లి రాజప్రసాదాన్ని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు అధ్యక్షులు నెక్కంటి ఆదినారాయణ, నిల్లా భద్రం, కుక్కల సత్యనారాయణ, అంగర వీరబద్రకుమార్ (చిన్న) పాల్గొన్నారు.

గోనె సంచుల కొరత లేకుండా చూస్తాం

పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివరామప్రసాద్

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల-2 రైతు భరోసా కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి షెడ్యూలింగ్‌లో, ట్రక్ షీట్ జనరేషన్‌లో రైతు భరోసా కేంద్రం సిబ్బందికి, పిపిసి సిబ్బందికి సూచనలిచ్చారు. డిఎస్ఒ, సివిల్ సప్లై పిపిసి టెక్నికల్ సిబ్బంది, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఎఒ చామర్తి జయ వాసూకి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కాళ్లలో వానపల్లి శ్రీనివాసరావు పొలాన్ని సందర్శించి ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు తేమ శాతం తదితర విషయాల్లో అవగాహన కల్పించారు. కోతలు పూర్తయిన ధాన్యాన్ని వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రైతులకు గోనె సంచుల కొరత లేకుండా చేస్తామని తెలిపారు. రైతులకు ఏమైన ఇబ్బందులు ఉంటే ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ధాన్యం పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా వివరించారు.

మోడీని గద్దె దింపాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆకివీడు

దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్న మోడీ ప్రభుత్వాన్ని కార్మిక వర్గం ఐక్యంగా గద్దె దింపాలని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో మేడే ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎందరో రైతులు తమ భూములను, 32 మంది తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించిన విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం అమ్మేయడం దుర్మార్గమన్నారు. ఈ రకమైన చర్యలను ప్రతిఘటిస్తూ మేడే స్ఫూర్తిగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, పెంకె అప్పారావు, సందక రాము, అనసూయ పైలయ్య, రాము పాల్గొన్నారు.

జెండావిష్కరణలు, ర్యాలీలు నిర్వహించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిఐటియు తాడేపల్లిగూడెం మండల కమిటీ సమావేశం ఆమంచి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరుపరపు రంగారావు మాట్లాడుతూ మేడే సందర్భంగా గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు జరపాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల కుదింపునకు వ్యతిరేకంగా ఈ మేడేను కార్మికులు దీక్షా దినంగా పాటించాలనానరు. కండెల్లి సోమరాజు మాట్లాడుతూ మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు, మోటార్ సైకిల్ ర్యాలీ జరుపనున్నట్లు తెలిపార. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, స్కీం వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కసే నాగమణి సర్ది అబ్బులు, ఎం.సారమ్మ, బి.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

సిబ్బందికి ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గూడెం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ, జిల్లా ప్రజారవాణా డిపార్ట్మెంట్ అధికారి ఎ.వీరయ్య చౌదరి తాడేపల్లిగూడెం బస్‌స్టాండ్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందికి, ప్రయానికులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వీరయ్య చౌదరి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినందుకు సూపరింటెండెంట్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు, కండక్టర్లు ,డ్రైవర్లు గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం దారుణం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ గతంలో టెంట్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ ఇచ్చేవారని, ఇప్పుడు అవేమీ లేకుండా చేశారని వాపోయారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో దారుణంగా విఫలమయ్యారని తెలిపారు. కూలీలు మండుటెండలో పనిచేస్తున్నారని, టెంట్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మరపట్ల సుబ్బారావు, చనుబోయిన సుజాత, ఎడవల్లి వేణు, మరపట్ల పవిత్ర, గజ్జల నాగరాజు, చనుబోయిన దుర్గారావు, గొల్లపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు.

కోలాటంపై శిక్షణ

ప్రజాశక్తి - ఆచంట

మేడేను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో కోలాటంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ అన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వలీ మాట్లాడుతూ మేడే సందర్భంగా కార్మికులు, కర్షకులు, అసంఘటిత రంగ, భవన నిర్మాణ కార్మికులు, యుటిఎఫ్, అభిమానులు కార్యకర్తలు శ్రేయోభిలాషుల మధ్య ఉత్సాభరితంగా కార్యక్రమాల చేపట్టినట్లు ఆయన తెలిపారు. మేడేను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, ప్రజానాట్య మండలి మండల కార్యదర్శి సిరా నరసింహమూర్తి, కొండేటి రాఘవులు, గుత్తుల శ్రీదేవి, నిమ్మల వెంకట తాయారు, ఝాన్సీ పాల్గొన్నారు.

లయన్స్ సేవలు విస్తృతం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రపంచం వ్యాప్తంగా అభాగ్యులకు అండగా ఉంటున్న లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృత పరుస్తూ నూతన కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా లయన్స్ క్లబ్ మొదటి గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. తాడేపల్లిగూడెం స్పిరిట్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు నూకల జయ భారతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 29, 30వ తేదీల్లో ఏలూరులో జరగబోయే గవర్నర్ కన్వన్షన్‌ని విజయవంతం చేయాలని సూచించారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లా 316జి కార్యాలయన్ని లయన్ పదం కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్ నూకల నాగ మల్లేశ్వరరావు, బత్తుల ప్రసాద్, సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు వార్డుల్లో ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం యాగర్లపల్లి పరిధిలోని 21, 22, 23 వార్డుల్లో శుక్రవారం జరుగుతున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తాడేపల్లిగూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటిస్తూ పైకార్యక్రమాలను ఆన్‌లైన్ చేయనపుడు కచ్చితమైన సమాచారం పూర్తిచేయాలన్నారు. దానికి ఆశా, వాలంటీర్, శానిటేషన్ కార్యదర్శులను సమన్వయం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. నీటి నిల్వలు ప్రమాదమన్నారు. వారానికి ఒకసారి డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

వైద్య సదుపాయాల్లేని పల్లె ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే ఫ్యామిలీ డాక్టర్ ముఖ్యోద్దేశమని ఉండి పిహెచ్‌సి డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. శుక్రవారం చిన్నపుల్లేరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ర మాట్లాడుతూ వైద్య సదుపాయాలు లేని గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఫామిలీ డాక్టర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది, ఉండి పిహెచ్‌సి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా రైతు భరోసాకు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - అత్తిలి

అర్హులై ఉండి రైతు భరోసా పడకపోతే ఆయా రైతులు ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని ఎఒ టికె.రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొత్తగా పొలం కొని పాస్‌బుక్ తీసుకున్న వారైనా సరే 30వ తేదీలోపు దగ్గర్లోని రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.